**ఒక్కసారి తల పైకెత్తి ఒళ్ళు విరుచుకున్నాడు రఘురామయ్య.** సిగరెట్ తీసి వెలిగించి గట్టిగా ఓ దమ్ము పీల్చాడు — ఎంత ఆలోచించినా ఉపాయం తట్టలేదు. వదిలిన సిగరెట్ పొగలోంచి ఘనశ్యాం ముఖం కనపడుతోంది. ఒక్కసారి పళ్ళు నూరుకున్నాడు. ఆ మనిషి అక్కడ లేకున్నా అతని మీద కసి అంత ఉంది. కారణం ఏమైనా తప్పు చేశాడా ?

* * *

ఉద్యోగంలో చేరిన అకౌంటెంట్‌లలో ఘనశ్యాం ఆఖరు వాడు. వచ్చిన వారం రోజుల్లోనే రఘురామయ్య ఫ్యాక్టరీలో పని చేసే వారందరికి మచ్చికయ్యాడు. గ్రాడ్యుయేట్ కావడం మూలాన ట్రేడ్ యూనియన్ అంటే ఏమిటో తెల్సు. ఉత్సాహం, చొరవ ఉన్నవాడు కాబట్టి ఓ ట్రేడ్ యూనియన్ స్థాపించాడు. తనే ప్రెసిడెంట్ అయ్యాడు. వేరే పదవులకు కూడా అతను సూచించిన అభ్యర్థులే పోటీ లేకుండా ఎన్నికయ్యారు. ఘనశ్యాం ఆధ్వర్యాన కార్మికుల స్థితి మెరుగయ్యే కార్యక్రమాలు మొదలయ్యాయి. కార్మికులకు రాత్రి పాఠశాల, విద్యావంతుల సహాయంతో నడప సాగాడు. మద్యపాన వ్యతిరేకతను బలపరిచాడు. తమ ఫ్యాక్టరీ ప్రాముఖ్యత, తాము చేసే పని ఆర్థిక రీత్యా ఎంత ముఖ్యమైనదో మొదలయినవి ప్రచారం చేయసాగాడు.

ఆటల పోటీలు, జాతీయ పండగలు, సాంస్కృతిక కార్యకలాపాలు జరగసాగాయి. రఘురామయ్య వాటిలో కొన్నిటికి అధ్యక్షత వహించాడు కూడా.

ఫ్యాక్టరీలో పని చురుగ్గా సాగటం, వర్కర్లు శుభ్రంగా వుండటం, నిర్ణీత వేళల్లో హాజరు కావడం మొదలయింది. కావున ఉత్పాదన శక్తి ఎక్కువయ్యింది. పోయినేడు కన్నా లాభశాతం, ఉత్పత్తి పెరిగింది. చాలా సంతోషించాడు రఘురామయ్య.

అసలు సంగతి ఇక ఇప్పుడే మొదలు. ఆర్థిక సంవత్సరం ఆఖరయ్యింది. కాబట్టి బోనస్ ఇచ్చే పద్ధతి ప్రవేశపెట్టాలని కూలి రేట్లు పెంచాలని ఘనశ్యాం నాయకత్వాన రఘురామయ్యకు ఓ వినతి పత్రం సమర్పించుకున్నారు. దాంట్లో — కార్మికులకు సంక్షేమం ఇతరత్రా చూసేందుకు వర్కర్స్ కమిటీ ఏర్పాటు చేయాలని. కేవలం వర్కర్ల కోసం ఓ ఆసుపత్రి పెట్టాలని, యూనిఫాం ప్రతి వర్కరుకి ఇవ్వాలని, వగైరా ఇతర కోర్కెలున్నాయి.

వర్కర్లు వాళ్ళ కోర్కెలు, వాటి విలువ బేరీజు వేసి చూసుకుంటే నాకు మిగిలేదెంత అనే భావం రాసాగింది రఘురామయ్యకు.


* * *

మరోసారి గట్టిగా దమ్ము పీల్చాడు రఘురామయ్య. ఇంత సేపు అల్లుణ్ణి చూస్తున్న మామ హఠాత్తుగా అన్నాడు "పోనీ ఆ ఘనశ్యాం గాణ్ణి నౌకర్లోంచి తీసేస్తే."

"తీసేస్తే...?" — రాఘురామయ్యకు, ఎంత కార్మిక సంఘాల జ్ఞానం లేని వాడైనా ఘనశ్యాంను తీసేస్తే ఏమయ్యేదీ తెలుసు...

తీసేస్తే...ఘనశ్యాంను తీసేస్తే...

తీసేసి—తీ సి—వే స్తే ...ఆలోచనల్లో కొట్టుకుంటూ వుండగా సంపత్ రెడ్డివచ్చాడు. అతను, అక్కడికి రెండు మైళ్ళ దూరంలో వున్న మిల్లుయజమాని.



# ఫ్యాక్టరీ - ఓ సంఘం

దేవరాజు మహారాజు

''రఘురామయ్య గారూ— మీ ఫ్యాక్టరీలో పన్జేసే ఘనశ్యాం మా వర్కర్లను లేవదీసి గొడవ గొడవ చేస్తున్నాడండీ—'' అన్నాడు.

''అదే ఆలోచిస్తున్నాం. అతన్ని తీసేస్తే వర్కర్లందరు పని మానేస్తారేమో—సమస్య పెద్దదవుతుంది.''

''కోర్కెలన్నీ తీరిస్తే ఇక ఫ్యాక్టరీ పెట్టి నిలువ చేసుకునే లాభాలేవి?''

వగైరా ఆలోచనల్తో గతుక్కుమన్నాడు రఘురామయ్య.

''తన గతే మవుతుంది? బట్టల మిల్లులో తను రెండు లక్షలకు కొనబోయే షేర్,—నగరంలోని తన స్నేహితుడు తనూ కలిసి తీద్దామనుకున్న సినిమా—మిస్ జుంజుం లోనెక్ జాకెట్లోని వంపులు, ఆ రాత్రి అనుభవం... బస్తీలో వున్న రాజరత్నం, కనకలక్ష్మి, వనజాక్షి... కూడా గుర్తుకొచ్చారు. అన్నిటికీ మించి తన కున్న షుగర్, బ్లడ్ ప్రెషర్ భూతాల్లాగా, వికృతంగా అట్టహాసం చేస్తున్నాయి... తను ఛస్తే నలుగురు బిడ్డలూ వాళ్ళ పెళ్ళిళ్ళూ, ఇప్పుడే నడుస్తున్న తన కొడుకు... వీళ్ళందర్నీ ఎవరు రక్షించాలి? తను బాగుంటే గదా, ఇక్కడ లాభాలొస్తేగద!'' —తమాయించుకున్నాడు రఘురామయ్య.

''మనం వెళ్ళి పోలీస్ ఇన్స్పెక్టర్ని కలుద్దాం. అంతా ఆయనకే విన్నవించుకుందాం'' సంపత్ రెడ్డి సలహా యిచ్చాడు.

రాత్రి ఇన్స్పెక్టర్ని 'కలవడం' పూర్తయింది. మర్నాడు పని ప్రారంభమైన గంటలో ఓ జీప్ వచ్చింది. రెండు మైక్ సెట్స్ దిగాయి. ఫ్యాక్టరీ గేటు ముందు షామియానా వెలిసింది, రంగు కాగితాల తోరణాలు సినిమా రికార్డుల ధ్వని—అన్ని సమకూరిన వాతావరణం ఏర్పడింది. షామియానా క్రింద వేదిక తయారైంది.

ఇంకా సేపట్లో, తెల్లబట్టలు వేసుకుని సంపత్ రెడ్డి అతని ఫ్యాక్టరీనుండి ఓ ఇరవై మంది వచ్చారు. వారికి రఘురామయ్య

ఫ్యాక్టరీలోని ఉద్యోగి రాఘవులు అనే అతను నాయకత్వం వహించాడు.

రాఘవులు బృందం రఘురామయ్య రూం దగ్గిర నిలబడ్డారు. రాఘవులు లోపలికెళ్ళి ఓ కాగితం యిచ్చాడు. రఘురామయ్య రాఘవులు బయటకొచ్చి వర్కర్లతో ఏదో చెప్పాడు. వెంటనే "రఘురామయ్య డౌన్ డౌన్— యూనియన్ జిందాబాద్—కార్మిక వ్యతిరేక విధానం నశించాలి" అని గోల. కాసేపట్లో రాఘవులు లోనికెళ్ళి ఇరవై నిమిషాల తర్వాత విజయ గర్వంతో బయటికొచ్చాడు. "కార్మిక ఐక్యత వర్ధిల్లాలి— ప్రపంచ కార్మికులారా ఏకం కండి"—అని నినాదాలిస్తూ ఫ్యాక్టరీ అంతా తిరిగి అందరికీ చెప్పారు. ఈ రోజు సెలవు — అందరూ రావాలని కూడా చెప్పారు.

ఓ యూనియన్ వుండిగా, మరొకటి యెందుకూ?— అని ఆలోచించి, అర్థం కానందుకు ఆశ్చర్యపడ్డారు కార్మికులు. ఏమో చూద్దాంలే అని అయిష్టంగా కదిలి, షామియానా ముందుకూర్చున్నారు.

కార్యక్రమం మొదలయింది.

అనుకున్నట్లుగా కార్యక్రమం జరిగింది.

'కార్యక్రమమంతా' ముగిసింది,

* * *

తల్లి అనారోగ్యం కారణంగా రెండురోజులు వూళ్ళో లేని ఘనశ్యాం వూళ్ళోకి ఫ్యాక్టరీకి వచ్చీ రావడంతోనే కొత్తయూనియన్ విషయం విని ఆశ్చర్యపోయాడు. ఆశ్చర్యం ఆవేశం, కోపం, ఒకదాని నుండి ఒకటి పుట్టుకొచ్చి, చివరకు సరే చూద్దాం అనుకున్నాడు యూనియనేదైతే ఏం కార్మిక సమస్యలు సక్రమంగా పరిష్కరిస్తే చాలు అనుకున్నాడు. మామూలుగా పనికి హాజరవసాగాడు

వారం గడిచింది. కొత్త యూనియన్‌కు వ్యతిరేకత ఏదీ కనిపించలేదు. చాలా మందికి మనసులో రఘురామయ్యకు ఇచ్చిన వినతిపత్రం గుర్తుంది. ఆయనేం జవాబు చెబుతాడో అని కుతూహలంగా కూడా వున్నారు.

ఎనిమిదోనాడు ఉదయం, కొత్త యూనియన్ సెక్రటరీ రాఘవుల్ని కల్సుకుని "వినతి పత్రం సమర్పించిన విషయం మీకు తెల్సు కదా! దాని విషయం ఏమయిందో రఘురామయ్యగార్ని మీరే అడిగితే గౌరవప్రదంగా వుంటుం"దన్నాడు ఘనశ్యాం.

"అది మేం సమర్పించింది కాదుగదా" అని ఆశ్చర్యం వ్యక్తం చేసి, "త్వరలో మరో వినతి పత్రం సమర్పిద్దాం" అని కర్తవ్యాన్ని కూడా తెలియజేశాడు.

కార్మికుల నోర్లు కొట్టించడం తన అభిమతం కాదని తెలిసి కూడా ఇలా మాట్లాడతాడేం అనీ ఘనశ్యాం అయోమయంలో పడ్డాడు. వర్కర్లందర్నీ పిలిపించి కర్తవ్యం ఆలోచించాడు.

పని ఆపుదాం అన్నారు కొందరు.

పూట గడిచేదెలా అని ఆలోచించారు కొందరు.

అనేక అభిప్రాయాల వాళ్ళు - అభిప్రాయాలు వ్యక్తం చేసుకుని, చర్చించుకుని, వాగి వాగి గొంతులు చించుకుని, తిట్లు తిట్టుకుని ఉద్రేకాలు పెరిగాక - సమ్మె జరగాల్సిందే, కార్మికులకు న్యాయం కావాల్సిందే అనే వాళ్ళు గెలిచారు.

ఇంతలో రాఘవులు అక్కడికి చేరి కొంత మందిని తనవైపు తిప్పుకున్నాడు. సమ్మె అవసరం లేదు అని ప్రకటించాడు. చాలా మందికి ప్రకటన నచ్చలేదు.

ఘనశ్యాం నాయకత్వంలో సమ్మె జరిగింది. ఫ్యాక్టరీ మూత పడింది.

రాత్రంతా ఫ్యాక్టరీలో బోలెడు గొడవల య్యాయని తేలింది

పోలీసులు అనుమానం మీద ఘన శ్యాంను, అనుచరుల్లో ముఖ్యుల్ని అరెస్టు చేశారు. వాతావరణం చల్లబడింది పరిస్థితులు అదుపులోకొచ్చాయి.

ఫ్యాక్టరీ తెరవాలన్న రాఘవులు కృషి ఫలించింది. రాఘవులు సెక్రటరీగా కలిగిన రిజిష్టర్డు ట్రేడ్ యూనియన్ ఘనశ్యాం విడుదల కోరుతూ తీర్మానం ఆమోదించింది.

మరునాడు పోలీస్ స్టేషన్ నుండి యింటికి తిరిగొస్తున్న ఘనశ్యాం తలమీద, కనిపించని చేతులేవో బలంగా దెబ్బలు కొట్టాయి- యింకా అక్కడక్కడ దెబ్బలు- స్పృహలో లేకుండా చేశాయి.

రాఘవులు సారాదుకాణలో తాగి ఎవర్నో కొట్టి గలాభా చేసినందుకు పెట్టబడిన కేసు కొట్టివేయబడింది.

సబ్ యిన్స్పెక్టర్ గారికి వారు కోరుతున్న చోటుకు ట్రాన్స్ఫర్ అయ్యింది. వీడ్కోలు పార్టీకి సన్నహాలు చేశారు రఘురామయ్య సంపత్ కుమార్లు

పేపర్లో—

కార్మికులను అక్రమైన సమ్మెకు ప్రోత్సహించి వారిని తప్పు తోవ పట్టించిన వ్యక్తిని- సమ్మెఆగిన తర్వాత ఎవరో గాయపరిచారని, దర్యాప్తు జరుగుతోందని వార్త వచ్చింది.

రఘురామయ్యకు ఉత్తరం వచ్చింది, అంతా తయారుగావుంది. షూటింగ్ మొదలు పెట్టాలని.

రాఘురామయ్య మామగారు ఇస్త్రీ కెళ్ళారు. ఇంకో పెద్ద అగ్గిపెట్టెల ఫ్యాక్టరీ పెడదామన్న అల్లుని మాట దాటకుండా - సిటీకి వెళ్ళినప్పుడల్లా లేబర్ ఆఫీసర్ని రఘురామయ్య కలుస్తూనే వున్నాడు విశేషాల్లేవని నిజమైన అబద్ధాలు చెప్తూనే వున్నాడు.

ఘనశ్యాం సంగతి తెలియదెవరికీ-

ఘనశ్యాంకు వున్న కొందరు నిజమైన అనుచరుల జాడ కూడా తెలీడం లేదు. వీళ్ళంతా ఎటు వెళ్ళి పోయ్యారో ఏమయ్యారో ఫ్యాక్టరీలో ఎవరికి తెలీదు. అవసరం లేదన్నట్లుగా ఎవరూ పట్టించుకోలేదు.

వాళ్ళు కనిపించడం లేదనుకోవడం తెలివి తక్కువతనం. వాళ్ళలో చీకటి రగులుతూనే వుంది. ఎప్పుడో సమాజం మీద కోట్లాది ఘనశ్యాంలు ప్రశ్నిస్తూ ఉదయిస్తారు తప్పదు !!

వాళ్ళు కనిపించడం లేదనుకోవడం తెలివి తక్కువతనం. *

## రచయితలు గమనించాలి...

ప్రజాతంత్రలో ప్రచురణకు స్వీకరించబడని రచనలు, తగిన పోస్టేజి జతపరిచినా తక్షణమే త్రిప్పిపంపడం సాధ్యపడదు. రచనల పరిశీలనకు కనీసం రెండు నెలలు వ్యవధి అవుసరమవుతుంది. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకు కూడా అవకాశం వుండదు. సమాధానాలకోసం కార్డులు, ఇన్ల్యాండ్ కవర్లు పంపనవసరం లేదు. రచయితలు గ్రహించవలసిందిగా కోరుతున్నాం.

—ఎడిటర్